'84 రత్నాక్షి ఉగాది సస్పెన్స్ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

రాజకుమారి సొగసుగా కుర్చీలో కూర్చుంది. ఆమె కూర్చోనడం వలన ఖరీదైన ఆ కుర్చీ విలువ మరికాస్త పెరిగింది.

# అతిథిమర్యాద

'వసుంధర'

ఆమెకు కాస్త పక్కగా చేమంతి కూర్చుని ఉంది. చేమంతి అసలు పేరు ఏమైనా రాజకుమారి ఆమె కాపేరు పెట్టింది. ఆ తర్వాత చేమంతికూడా తన అసలు పేరు మరిచిపోయింది. ఆమె రాజకుమారి కంటె వయసులో రెండేళ్ళు పెద్ద. చిన్నతనం నుంచి రాజకుమారితోనే పెరిగింది. పదేళ్ళ వయసునుండి ఆమె రాజకుమారి అవసరాలన్నీ చూసుకొనడం ప్రారంభించింది.

రాజకుమారి తండ్రి మాధవరావు నగరంలో పేరుపడిన వ్యాపారస్థుడు. మాధవరావు ఇంటి వ్యవహారాలు చూసే గుమస్తా జగన్నాధం కూతురు చేమంతి. చేమంతి తన అంతస్థు నెన్నడూ మరచిపోదు. కాబట్టి రాజకుమారిది, ఆమెదీ మంచి స్నేహం.

"ఈ డ్రస్సు నీకు బాగా నప్పింది. రేపు కృష్ణకాంత్ వచ్చినప్పుడీ డ్రస్సే వేసుకో-" అన్నది చేమంతి

"ఏ డ్రస్సులో లైనా నేను అందంగానే వుంటాను-" గర్వంగా అన్నది రాజకుమారి. అప్పుడామె అహం శాంతించి- "అవునూ, కృష్ణకాంత్ అన్నావు - అతడెవరూ?" అన్నది మళ్ళీ.

"కృష్ణకాంత్ ఈ ఇంటికి కాబోయే యజమాని" అన్నది చేమంతి.

"ఈ ఇంటికి యజమానురాలిని నేను. ఇంకెవ్వరూ యజమానులు కాబోరు—" అన్నది రాజకుమారి.

"బాగుంది. నీ భర్త కూడా ఈ ఇంటికి యజమాని కాలేడా?" అన్నది చేమంతి నవ్వుతూ.

"నా భర్త అయినాసరే, నా ఇంట్లో నాకు అతిథిగానే ఉండాలి. నా ఇంటికి వేరెవ్వరూ యజమాని కావడానికి వీల్లేదు-" అన్నది రాజకుమారి.

ఆమెకు ఆ ఇల్లంటే ఎంతో ఇష్టం. చిన్నప్పట్నించీ ఆమె ఆ యింట్లోనే మసలింది. ఊహ తెలిసినప్పట్నించీ ఆమె ఆ ఇంట్లో తను కోరినవిధంగా మార్పులు చేయించుకుంటుండేది. ఆమె తండ్రి ఆమెకు ఎప్పుడో చెప్పేశాడు- "అమ్మా, ఈ ఇల్లు నీది. మేజరు కాగానే నీ పేరుకు మార్పించేస్తాను-" అని.

"అయితే ఈ ఇల్లు నాది. మీరంతా నా అతిథులు—" అనేది రాజకుమారి.

ఆమెకు తలిదండ్రులు రాజకుమారి అన్న పేరు ఏ ముహూర్తాన పెట్టారో కానీ ఆమె ఆలోచనల్లో రాజరికం ఉంది. ఆమె పథకాల్లో రాజకీయం ఉండేది. ఆ ఇంటి కామె మహారాణిలా ప్రవర్తించేది. తల్లిదండ్రులు సైతం ఆమెకు భయపడేవారు.


"అమ్మా—నేనీ ఇల్లు వదిలిపోను. ఇదే నా సామ్రాజ్యమనిపిస్తుంది. ఇది వదిలి బయటకు వెడితే నాకు భయంగా ఉంటుంది-" అనేదామె తరచుగా

"ఆడపిల్లవు అలాగనడం తప్పమ్మా" అనేది తల్లి.

"నేను ఆడపిల్లనే అయినా రాజకుమారిని"—అనేదామె.

ఆ యింట్లో పనివారలామె కను సన్నల్లో మసలేవారు. ఆ యింట్లో తల్లిదండ్రులు కాక దూరపు బంధువైన తాతగారు. ఒక విధవ మేనత్త. గుమస్తా జగన్నాధం. ఆతడి భార్య సీతమ్మ, పిల్లలు అయిదుగురు. ఒక వంటమనిషి. ఒక తోటమాలి- నిత్యం ఉండేవారు. వీరుకాక రోజూ వచ్చిపోయే పనిమనుషులు నలుగురు. ఇంట్లో అందరి అవసరాలూ రాజకుమారి చూసుకునేది. ఆ విషయంలో ఆమె ఎంత సమర్థంగా వ్యవహరించేదంటే ఆమె ఉండగా ఏ ఒక్కరికీ లోటన్నది ఉండేది కాదు. ఆమె ఇంట్లో లేకపోతే అదే పెద్ద లోటుగా ఉండేది.


ఇంట్లో ఉండేవారికే కాక—ఇంటికి వచ్చిపోతుండేవారికి కూడా వారివారి అభిరుచులను బట్టి అద్భుతమైన మర్యాదలు జరిగేవి.



తన ఇంటికి వచ్చిన ప్రతివారూ ఆ విషయాన్నొక అపూర్వానుభవంగా గుర్తుంచుకోవాలని రాజకుమారి ఆశయం.

చేమంతి చిలిపిగా నవ్వి— "కృష్ణకాంత్ వ్యక్తిత్వంగల మనిషి .అతడు నీకు భర్తగానే తప్ప అతిధిగా ఉండడు" అన్నది.

"భర్తను అతిథిగా మన్నించడం నా వ్యక్తిత్వం. నా వ్యక్తిత్వాన్ని గుర్తించని మనిషి నాకు భర్త కాలేడు." అన్నది రాజకుమారి.



"ఈ మాటలన్నీ ఇప్పుడే-రేపు అతడిని చూసినప్పుడు.."అని తమాషాగా నవ్వింది చేమంతి.

అయితే చేమంతి రాజకుమారి విషయంలో తప్పు అంచనా వేసింది. రెండు రోజుల తర్వాత కృష్ణకాంత్ తనను చూడడానికి వచ్చినప్పుడు రాజకుమారి అతడి అందాన్నీ విగ్రహాన్నీ చూసి పరవశించ లేదు. అతడు తన వ్యక్తిత్వానికి విలువ నిస్తాడా అనే ఆలోచించింది.

కృష్ణకాంత్‌కి రాజకుమారి తొలిచూపులోనే నచ్చింది.

కృష్ణకాంత్ ఒక్కడే వచ్చాడు పెళ్ళి చూపులకు. ఇంట్లో పెద్దహంగామా ఏమీ జరగలేదు. రాజకుమారి తనకు తోచిన విధంగా డ్రస్ చేసుకుంది. ఆమె స్వయంగా అతడిని తీసుకుని వెళ్ళి ఇల్లంతా చూపించింది.

"ఇల్లు చాలా బాగుంది—". అన్నాడు కృష్ణకాంత్.

"ఇది నా యిల్లు. బాగుండక తప్పదు—" అన్నది రాజకుమారి.

"మీ యిల్లయితేనే బాగుండాలా?"

ఒకప్పుడిది నా యిల్లుకాదు. అప్పుడిది బాగుండేదికాదు ఇది నా ఇల్లు కాగానే ఇందులో నేనెన్నో మార్పులు చేయించాను-"

"మీరు చేయించిన మార్పులు నేను తెలుసుకోవచ్చా?"

ఈ యింట్లో బాగున్నదనిపించే ప్రతీదీ నేను చేయించిన మార్పే!"

"మార్పుకు కారణం మీరేనని నేనూ ఒప్పుకుంటాను. మీ ఉనికి ఈ ఇంటికో అందాన్ని తీసుకొచ్చింది." అన్నాడు కృష్ణకాంత్.

రాజకుమారి అతడి వంక చురుగ్గా చూసింది- "అతిథుల్ని నేను గౌరవిస్తాను. కానీ అతిథిగా మీ మర్యాదను మీరూ విలబెట్టుకోవాలి"-

"ఇప్పుడు నేనేం చేశాను?"

రాజకుమారి గంభీరంగా- "మనమిద్దరం ఏకాంతంలో వున్న ఇద్దరు యువతీ యువకుల్లాకాక- ఇద్దరు మంచి స్నేహితుల్లా మాట్లాడుకోవాలి"-అన్నది.

"నేనలాగే మాట్లాడాను"-

"అని మీరనుకుంటే సరిపోదు. నేనూ అనుకోవాలి-"

కృష్ణకాంత్ ముఖం ఎర్రబడింది- "అన్నింటికీ మీనియమాలే కాదు. ఈఇంటికి త్వరలో కాబోయే యజమానిని నేను. నా నియమాలు వేరే ఉంటే?"

"ఈ ఇంటికి నేనెప్పుడూ యజమానురాలిని-"




"ఎందువల్ల?"

"కలకాలం ఈ ఇంట్లో నా పద్ధతులే కొనసాగాలి. ఈ ఇంటికెవరు వచ్చివెళ్ళినా ఎంతో సంతోషంగా వెడతారు. అందుకు కారణం నా పద్ధతులే! నాకులా అతిధి మర్యాద చేయడం వేరొకరివలన కాదు-" అన్నది రాజకుమారి

"నా అతిథి మర్యాదలు మీకంటే మెరుగ్గా ఉంటే?"

"అది అసాధ్యం"

"మీరు అసాధ్యమన్నది సాధ్యపడితే?"

"అప్పుడు చెబుతాను—"

కృష్ణకాంత్ — "కేవలం అతిథుల కోసం ఒక ఇంటికి యజమానురాలు కావాలనుకునే మీ సంస్కారం నాకు వచ్చింది-" అన్నాడు.

"థాంక్స్!" అన్నది రాజకుమారి.

"అయితే అతిథి మర్యాద విషయంలో మీరింకా నానుంచి చాలా నేర్చుకోవల్సివున్నది. ఉదాహరణకు నేనిప్పుడు మీ అతిథిని. నా మనసును నొప్పించడానికే తప్ప సంతోషపెట్టడానికి మీరు ప్రయత్నించడంలేదు"

రాజకుమారి నవ్వి - "గవాస్కర్‌కు మార్షల్ అంటే అభిమానం వుండవచ్చు. అలాగని అతని బౌలింగులో అవుటు కావాలని కోరుకోడు. ప్రతి బంతికీ ఫోర్ కొట్టి మరీ సెంచరీ చేయాలనుకుంటాడు"అన్నది.

"అంటే?"

"అతిథి మర్యాద అంటే వ్యక్తిత్వాన్ని మరుగుపరుచుకొనడం కాదు—"

"చాలా తెలివైన దీమె" అనుకున్నాడు కృష్ణకాంత్. పైకిమాత్రం "ఎదుటి మనిషిని తాత్కాలికంగా సంతోషపెట్టడం కోసం నాలుగు మంచి మాటలు చెప్పవచ్చు. నా గురించి పూర్తిగా తెలియకుండా నా అతిథి మర్యాద మీ మర్యాదను మించలేదన్నారు. మీ అభిప్రాయం తప్పని రుజువుచేయడమే నా జీవితాశయం—" అన్నాడు.

"నా గురించి చాలా మంచి జీవితాశయాలేర్పరచుకున్నారు!" అన్నది రాజకుమారి గర్వంగా.

కృష్ణకాంత్ దెబ్బతిని —" ఎవరెవరో నేను తెలుసుకోవచ్చా?" అన్నాడు.

"మా బంధువుల్లో ఇద్దరున్నారు. ఒకడిది అహంకారం. రెండోవాడిది అతి వినయం. రెండూ నాకు నచ్చవు. ఇద్దరూ ఆ లక్షణాలు విడిచిపెట్టడం జీవితాశయాలుగా చేసుకున్నారు..."

ఆమె చెప్పింది నిజం కాదని- ఆమె తన అభిరుచులను చెప్పడానికి ఎన్నుకున్న పరిస్థితి అది అని కృష్ణకాంత్ గ్రహించాడు. అందుకే— "అయితే నాపై మీ అభిప్రాయం ఏమిటి? నేను అహంకారినా లేక ధూర్త లక్షణం ఉన్నవాడినా?" అన్నాడు.

"ప్రస్తుతానికి మీ గురించి ఇంకేమీ ఆలోచించదల్చుకోలేదు. మీకిప్పుడో జీవితాశయం ఏర్పడిందిగా. కొంతకాలంపాటు బిజీగా ఉంటారు..."

"ఆ విషయం తర్వాత— ప్రస్తుతానికి మీరు నా గురించి ఆలోచించక తప్పదు. నాకు మీరు ఎంతగానో నచ్చారు. మీరు మీ నాన్నగారికి మీ అభిప్రాయం చెబితే మన వివాహం జరుగుతుంది...." అన్నాడు కృష్ణకాంత్.

"మీ జీవితాశయం నెరవేరినాకనే— నా అభిప్రాయం మానాన్నగారికి చెబుతాను—" అన్నది రాజకుమారి.

కృష్ణకాంత్ ఆశ్చర్యంగా—" అంటే మీరు నన్ను సవాలుచేస్తున్నారా!"అన్నాడు.

"నేను సవాలుచేయడంలేదు. మీరు మీ శక్తిని రుజువు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు—"అన్నది రాజకుమారి.

"మీకు అహంకారం జాస్తి—"

రాజకుమారి నవ్వి- "ఆత్మవిశ్వాసాన్ని అహంకారమని భ్రమించడం విచక్షణ తక్కువైన వారి లక్షణం-" అన్నది.

"థాంక్స్- అయితే మనమింక మాట్లాడుకోవలసిందేమీలేదు-" అన్నాడు కృష్ణకాంత్ గంభీరంగా.

"ఆ విషయం నాకు తెలుసు-" అన్నది రాజకుమారి

* * *

"కృష్ణకాంత్ నీకు నచ్చాడామ్మా?" అన్నాడు మాధవరావు ఆత్రుతగా.

రాజకుమారి నవ్వి—"అతిధి మర్యాదలో నన్ను మించుతానని సవాలుచేసి వెళ్ళాడు. అదేమిటో పూర్తయినాకే మిగతావిషయాలు చూద్దాం" అన్నది

మాధవరావు దిగులుగా "అయితే నీకో విషయం చెప్పక తప్పదు" అన్నాడు.

"ఏమిటది నాన్నా?"

"గత రెండేళ్ళుగా మనవ్యాపారం బాగో లేదు. నష్టంమీద నష్టంవచ్చి తట్టుకోవడం కష్టంగా ఉన్నది. ఆ సమయంలో కృష్ణ కాంత్ పరిచయమైంది. మన కుటుంబానికి అతడి అవసరం ఎంతైనా ఉన్నదిప్పుడు. నీవు మూర్ఖంగా ప్రవర్తించకు. అతడు అన్ని విధాలా యోగ్యుడు— కాదనకు——" అన్నాడు మాధవరావు.

రాజకుమారి కోపంగా— "మీ వ్యాపారాన్నీ నా జీవితాన్నీ ముడిపెట్టవద్దు. అతడు యోగ్యుడైతే ఆ యోగ్యతను రుజువు చేసుకోనివ్వండి-" అన్నది.

"నీకెలా నచ్చచెప్పాలో నాకు అర్థం కావడంలేదు. నీ కోసమే నేను చెబుతున్నది. వ్యాపారానికీ, జీవితానికీ ముడిపెట్టేవాడిని కాదు నేను" అన్నాడు మాధవరావు.

"నా కోసం మీరేం చెప్పనక్కరలేదు-" పెంకిగా అన్నది రాజకుమారి

"అయితే అసలు విషయం విను. ఈ ఇల్లంటే నీకు ప్రాణం. ఈ ఇల్లు నీకు కావాలి— అవునా?"అన్నాడు మాధవరావు.

"ఈ ఇల్లు నాదే అని మీరెప్పుడో చెప్పారు—" అన్నది రాజకుమారి.

"అవును-నిజమే-కానీ ఆ మాట నిల బెట్టుకోలేని పరిస్థితి ఇప్పుడేర్పడింది. ఈ ఇల్లు నీదిగా వుండాలంటే నాకిప్పుడు నీ సహకారం కావాలి-" అన్నాడు మాధవరావు.

రాజకుమారి కంగారుగా-"ఏం జరిగింది నాన్నా?" అన్నది.

"నెలరోజుల క్రితం ఏ దారీలేక కృష్ణ కాంత్‌కి యిల్లు అమ్మేశాను. విషయం అతడికీ నాకూతప్ప వేరెవ్వరికీ తెలియదు. ఇప్పుడీ యిల్లు నీది కావాలంటే అతడిని వివాహం చేసుకోవాలి"- అన్నాడు మాధవరావు.

"ఈ ఇల్లు అమ్మేశారా?" తెల్లబోయింది రాజకుమారి.

## గోరతము

తిరుపతి వేంకటకవులకీ, కొప్పరపు కవులకీ పడేదికాదు. వాళ్ళిద్దరి మధ్య కలహాలు జరుగుతూండేవి. ఆ కవుల కలహాలు కూడా సరసంగా వుండేవి.

తిరుపతి వేంకట కవులు "గీరతము" రచించారు. దానికి వ్యతిరేకంగా కొప్పరపు కవులు "గోరతము" రచించారు. ఎవరో



తిరుపతి వేంకటకవులతో "ఏమండోయ్ కొప్పరపు కవులు మీ గీరతంమీద గోరతం రాశారట" అన్నారు. వెంటనే తిరుపతి కవులు తడుముకోకుండా "వాళ్ళు పుంగవులు గదా, గోరతం చెయ్యక ఇంకేం చేస్తారు" అని వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. (పుంగవులు- అంటే ఎద్దులు అనే అర్థం వుంది. గోరతం అంటే పేడ తింద పొక్కనేరమంటారు—)

—ద్వా. నా. శాస్త్రి

"అవునమ్మా-రిజిస్ట్రేషన్ కూడా అయి పోయింది...."

వివాహానంతరంకూడా తన ఇంటికి భర్త అతిథిగా మాత్రమే ఉండాలని భావించిన రాజకుమారి- ఇప్పుడా ఇంటికోసమే- ఆ ఇంటి యజమానిని వివాహం చేసుకుం టుందా?

* * *

"మీరు వివాహానికి ఒప్పుకున్నారని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. అయితే ఒక్క నిజం మీకు చెప్పాలి-" అన్నాడు కృష్ణ కాంత్.

"ఊ" అన్నది రాజకుమారి.

"మీ నాన్నగారి వ్యాపారం నష్టంలో నడుస్తున్న మాట మాత్రం నిజం. కానీ పరిస్థితి మరీ అంత ఘోరంగా లేదు ఆయన నాకు ఇల్లు అమ్మిన కారణం ఒక్కటే. మీకూ ఆ ఇంటికీ అవినాభావ సంబంధం వున్నదనీ - ఆ యింటి కోసం ఎటువంటి త్యాగమైనా చేయడానికి సిద్ధపడతారనీ ఆయన అన్నారు. నే నాయనకు నచ్చాను. నన్ను తన ఇంటి అల్లుడిగా చేసుకోవడం కోసం మాత్రమే ఆయన ఇల్లు నా పేరుకు మార్చారు...."

"నాన్న మంచిపనే చేశారు—" అన్నది రాజకుమారి.

"వివాహానంతరం భర్త కూడా మీ యింట అతిథిగానే వుండాలని మీ అభిప్రాయం. అందుకని వెంటనే ఆ యింటిని మీ పేరుకు మార్చేస్తాను-" అన్నాడు కృష్ణకాంత్.

రాజకుమారి నవ్వుతూ - "అసాధ్యం సాధ్యపడితే ఏం చేస్తాననికదా ఒక సారి మీరు నన్నడిగారు. ఆ యిల్లు నా పేరు మీదకు మార్చవద్దు. మీ పేరునే వుండ నివ్వండి-" అన్నది.

"ఎందుకని?"

"అతిథి మర్యాదలో నన్ను మించిన మీ పేరున వుండడమే ఆ ఇంటికి తగును"—

"నేను అతిథి మర్యాదలో మిమ్మల్ని మించానా?"

"అవును. ఇంటికి వచ్చినవారిని అతిథులుగా గౌరవించడమే నాకు తెలుసు. కానీ నెల రోజులుగా మీ యింట్లో అతిథులుగా వుండే మమ్మల్ని మేమే యజమానులమని అనుభూతి చెందేలా గౌరవించారు మీరు. అతిథి మర్యాదలో మీ తర్వాతనే మేము—"

కృష్ణకాంత్ ఆశ్చర్యంగా— "ఇది నాకు స్ఫురించనే లేదు. అయితే ఆ యిల్లు నా పేరున వుండడం మరొకలా నాకు సహకరించి నా జీవితాశయాన్ని రెండు విధాలుగా నెరవేర్చిందన్న మాట—" అన్నాడు.

